# మోదీ పాలనలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు

**-- కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**

**కుసుమ రామయ్య పాఠశాలలో స్వచ్ఛ పాఠశాల కార్యక్రమం..**

**-- తరగతి గదుల శుభ్రతలో పాల్గొన్న బండి సంజయ్ కుమార్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



స్వచ్ఛ పాఠశాల కార్యక్రమంలో భాగంగా బీజేపీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యా కమిటీ నాయకులు మరియు స్థానికులతో కలిసి కరీంనగర్ పట్టణంలోని కుసుమ రామయ్య పాఠశాలలో తరగతి గదులను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ కుమార్ శుభ్రం చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలన విజయవంతంగా పూర్తైన సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇది ఒక వినూత్నమైన, ప్రజాహిత కార్యక్రమమని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి లక్ష్యంగా గతంలో "మోడీ గిఫ్ట్" పేరుతో సైకిళ్లను పంపిణీ చేసినట్లు గుర్తుచేశారు. ఈ సంవత్సరం కూడా అదే విధంగా సైకిళ్ల పంపిణీ కొనసాగిస్తామని తెలిపారు. ఈ నెల 21 వరకు పార్లమెంట్ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎల్లుండి అన్ని పాఠశాలల్లో ర్యాలీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మోదీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలనలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిందని పేర్కొన్న ఆయన, బాధ్యత గల ప్రజాప్రతినిధులుగా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

పాఠశాల శుభ్రత కార్యక్రమాల్లో భాగంగా మూడు పాఠశాలల్లో స్వయంగా పాల్గొన్నట్లు తెలిపారు. అలాగే "టిఫిన్ బై టాక్" కార్యక్రమాన్ని కూడా నిర్వహించినట్లు చెప్పారు. గతంలో సుమారు 20,000 సైకిళ్లు పంపిణీ చేసినట్లు పేర్కొని, ఈ సంవత్సరం కూడా అదే తరహా కార్యక్రమాలు కొనసాగిస్తామని వెల్లడించారు.

# బీఆర్ఎస్‌ది అబద్ధాల పునాది

## వాస్తవాలను వక్రీకరిస్తే ప్రజలు నమ్మరు..

**-అబద్ధాల పునాదులపై కేటీఆర్, జీవన్ రెడ్డి రాజకీయం**

**-జీవన్ రెడ్డి వాఖ్యలకు వైఎస్సార్ ఆత్మ ఘోషిస్తుంది..**

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**



కల్వకుంట్ల కుటుంబం అంటేనే అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ అని అందరూ భావించేవారని, కానీ ఇప్పుడు జీవన్ రెడ్డి కూడా వారితో చేతులు కలిపి అదే బాటలో ప్రయాణించడం అత్యంత దురదృష్టకరమని ప్రభుత్వ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర గార్డెన్స్ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ

వేములవాడలో బిఆర్ఎస్ నిర్వహించిన 'సార్ ' కార్యక్రమం పూర్తిగా వాస్తవాలను వక్రీకరించేలా, ప్రజలను తప్పుదోవ పట్టించేలా సాగిందని అన్నారు.బిఆర్ఎస్ నాయకులు అబద్ధాల ప్రచారానికే వేదికగా ఈ సభను మార్చుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలోనూ కేటీఆర్, బిఆర్ఎస్ నాయకత్వం అబద్ధాలతోనే నెట్టుకొచ్చిందని, అందుకే 2023లో ప్రజలు ఆ పార్టీని అధికారం నుండి దూరం చేశారని అన్నారు. ఇప్పటికైనా తమ తప్పులను సమీక్షించుకోవాలని, అంతేకానీ మళ్లీ అసత్య ప్రచారాలతో ప్రజలను మోసం చేయడం దురదృష్టకరమని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని, మేము రాసిచ్చిన బాండ్ పేపర్ పై ఉన్న ప్రతి హామీని నెరవేరుస్తున్నామని అన్నారు . కేసీఆర్ హయాంలో రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసిందని, అటువంటి పరిస్థితుల్లో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమాన్ని ఆపకుండా సమర్థవంతంగా ముందుకు తీసుకువెళు_న్నారని అన్నారు. . 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో జరిగిన అప్పు కన్నా, కేసీఆర్ కేవలం పదేళ్లలో చేసిన అప్పులే ఎక్కువని అన్నారు . 2014లో రూ. 75 వేల కోట్ల అప్పులతో ఉన్న రాష్ట్రాన్ని రూ. 8 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని అన్నారు .

శ్రీశైలం, నాగార్జునసాగర్, ఎల్లంపల్లి వంటి అనేక ప్రాజెక్టులను నిర్మించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, కాళేశ్వరం ప్రాజెక్టును గొప్పగా చెప్పుకునే బిఆర్ఎస్ నేతలు, అది కుంగిపోవడానికి గల కారణాలైన అవినీతి, అక్రమాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి వేములవాడకు నీటిని అందించే కాలువల కోసం 2005లోనే వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం రూ. 1737 కోట్లు మంజూరు చేసిందని, వరద కాలువ నిర్మాణం కూడా వైఎస్సార్ చొరవతోనే జరిగిందని అన్నారు . వేములవాడ అభివృద్ధిపై బిఆర్ఎస్ చేస్తున్న విమర్శలు నిరాధారమని, ప్రస్తుతం రాజన్న ఆలయ అభివృద్ధి, రోడ్ల విస్తరణ, కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులు రేవంత్ రెడ్డి కృషితో వేగంగా జరుగుతున్నాయని అన్నారు .బిఆర్ఎస్‌లో చేరిన జీవన్ రెడ్డి రాజకీయ అవకాశవాదంతో మాట్లాడుతున్నారని, గతంలో కాళికోట సూరమ్మ చెరువు కోసం తనతో కలిసి పోరాటం చేసిన వారే, ఇప్పుడు బీ ఆర్ ఎస్ వారిని ప్రశంసించడం విడ్డూరమని, ఇది సరైన రాజకీయ సంస్కృతి కాదని అన్నారు. ఒక వ్యక్తి వల్లే పార్టీ నడవదని, కాంగ్రెస్ సిద్ధాంతాల మీద నడుస్తుందని స్పష్టం చేశారు. కేటీఆర్ పాలనలో ఏమీ చేయని వారు, ఇప్పుడు అధికారం కోల్పోయాక ప్రజా సమస్యలు గుర్తుకు రావడం హాస్యాస్పదమని అన్నారు . బిఆర్ఎస్ నేతలు బీజేపీపై ఒక్క మాట కూడా మాట్లాడకుండా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకోవడం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయని ఆరోపించారు. వేములవాడ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలు అసత్య ప్రచారాలను నమ్మవద్దని పిలుపునిచ్చారు.

# మండీ బిర్యానీ తిని 11 మంది సిమ్స్ విద్యార్థులు అస్వస్థత

**వాంతులు, విరేచనాలతో ఆసుపత్రికి తరలింపు.. చికిత్స అనంతరం డిశ్చార్జ్**

**బలగం టీవీ, గోదావరిఖని**

గోదావరిఖని నగరంలోని సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్) వైద్య కళాశాలకు చెందిన 11 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురై అస్వస్థతకు లోనయ్యారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం, సిమ్స్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ముగియడంతో 12 మంది విద్యార్థులు సరదాగా కవిత థియేటర్ సమీపంలోని ఓ హోటల్‌లో విందు భోజనానికి వెళ్లారు. అక్కడ మండీ బిర్యానీ తిన్న అనంతరం తమ తమ గదులకు వెళ్లిపోయారు. కొద్ది సేపటికే 12 మందిలో 11 మంది విద్యార్థులకు వాంతులు, విరేచనాలు ప్రారంభమయ్యాయి. దీంతో వారిని వెంటనే గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సమాచారం మేరకు, ఎనిమిది మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురికాగా, మరో ముగ్గురికి స్వల్ప లక్షణాలు కనిపించాయి. ఆసుపత్రిలో చికిత్స అందించిన అనంతరం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు వారిని డిశ్చార్జ్ చేసినట్లు తెలిసింది.

# సర్కారు బడిలో చేరితే రూ.2 వేల ప్రోత్సాహకం

**శానగొండ సర్పంచ్ జీల రాజు యాదవ్ వినూత్న ప్రకటన**

**బలగం టీవీ, ఓదెల**




ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచేందుకు పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం శానగొండ గ్రామ సర్పంచ్ జీల రాజు యాదవ్ వినూత్న నిర్ణయం తీసుకున్నారు. శానగొండ ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించే ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు రూ.2 వేల నగదు ప్రోత్సాహకంగా అందజేస్తామని ప్రకటించారు. శనివారం గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించిన సర్పంచ్, అక్కడ పనిచేస్తున్న కూలీలకు 'బడిబాట' కార్యక్రమం గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజన పథకం, నాణ్యమైన విద్యాబోధన వంటి అంశాలను వారికి వివరించారు.

ప్రైవేట్ పాఠశాలలపై ఉన్న మోజుతో ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేయవద్దని సూచించిన ఆయన, గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ తీసుకునే ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు రూ.2 వేల నగదు అందజేస్తామని ప్రకటించారు. సర్పంచ్ చేసిన ఈ ప్రకటన గ్రామ ప్రజల నుంచి మంచి స్పందన పొందుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెరగడానికి ఈ నిర్ణయం దోహదపడుతుందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# టిప్పర్ ఢీకొని అల్ట్రాటెక్ కార్మికుడు మృతి

**బలగం టీవీ, పాలకుర్తి**



పాలకుర్తి మండలం రామారావుపల్లి గ్రామానికి చెందిన దుర్గం మల్లయ్య (52) శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. బసంత్‌నగర్‌లోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న మల్లయ్య విధులకు వెళ్తున్న సమయంలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది.

స్థానికుల వివరాల ప్రకారం, మల్లయ్య తెల్లవారుజామున ఫస్ట్ షిఫ్ట్ విధులకు హాజరయ్యేందుకు ఇంటి నుంచి బయలుదేరాడు. రామారావుపల్లి బస్టాండ్ సమీపంలో వేగంగా వస్తున్న టిప్పర్ వాహనం అతడిని ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఇదిలా ఉండగా, జయ్యారం క్వారీల నుంచి కన్నాల క్రషర్లకు బోల్డర్లను తరలించే టిప్పర్ లారీలు ఓవర్‌లోడ్‌తో పాటు అతివేగంగా నడుస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇరుకైన రహదారులపై నిత్యం భారీ వాహనాలు వేగంగా సంచరించడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. సమాచారం అందుకున్న బసంత్‌నగర్ ఎస్ఐ నూతి శ్రీధర్ సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# సిరిసిల్లలో యూకేజీ తరగతులకు బోధకులు, ఆయాల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

**జూన్ 16 వరకు దరఖాస్తుల ఆహ్వానం..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నిరుద్యోగులు మరియు ఉద్యోగార్థులకు విద్యాశాఖ శుభవార్త అందించింది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 2026--27 విద్యా సంవత్సరంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 48 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో నూతనంగా పూర్వ ప్రాథమిక (యూకేజిఅ) తరగతులను ప్రారంభించేందుకు అనుమతి లభించింది. ఈ నేపథ్యంలో చిన్నారులకు నాణ్యమైన విద్యాబోధనతో పాటు సంరక్షణ అందించేందుకు ప్రతి పాఠశాలలో ఒక ఇన్‌స్ట్రక్టర్ (బోధకుడు/బోధకురాలు), ఒక ఆయా పోస్టును భర్తీ చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) తెలిపారు.

గతంలో జూన్ 6న విడుదల చేసిన ప్రకటనకు సవరణలు చేస్తూ తాజా నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన స్థానిక అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు నిర్ణీత అర్హతలు, నిబంధనలను పరిశీలించి జూన్ 16 సాయంత్రం లోగా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులు సంబంధిత ప్రభుత్వ పాఠశాలల్లో యూకేజిఅ తరగతుల నిర్వహణలో సేవలందించనున్నారు. నియామకాలకు సంబంధించిన పూర్తి వివరాలు, అర్హతలు, దరఖాస్తు విధానం తదితర సమాచారం కోసం జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని లేదా సంబంధిత మండల విద్యాశాఖ అధికారులను సంప్రదించాలని డీఈఓ సూచించారు.



# మోదీ 12 ఏళ్ల పాలనా స్ఫూర్తితోనే స్వచ్ఛ పాఠశాల..

**-చీపురు పట్టి ఊడ్చి....పైపుతో నీళ్లు చల్లిన బండి సంజయ్**

**-సిరిసిల్ల కుసుమ రామయ్య జడ్పీహెచ్ఎస్ లో "స్వచ్ఛ పాఠశాల" నిర్వహించిన కేంద్ర మంత్రి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ "స్వచ్ఛ పాఠశాల" కార్యకర్తగా మారి,ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనను పురస్కరించుకుని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను "స్వచ్ఛ పాఠశాల" పేరుతో శుభ్రం చేసే పనికి శ్రీకారం చుట్టారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ సైతం శనివారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విచ్చేశారు. స్వయంగా చీపురు పట్టి ఊడ్చారు. పైపు నీళ్లతో తరగతి గదిని క్లీన్ చేశారు. ఆ తరువాత శుభ్రంగా తుడిచారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ మోదీ 12 ఏళ్ల పాలనను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా వివిధ వర్గాలను కలుస్తున్నామని,అనేక సభలు, సమ్మేళనాలు నిర్వహిస్తున్నామని అన్నారు . దేశంలో ఎక్కడా లేని విధంగా "స్వచ్ఛ పాఠశాల" పేరుతో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని పాఠశాలలను పరిశుభ్రం చేయాలని నిర్ణయించమని అన్నారు.రాజకీయాలకు అతీతంగా మన పాఠశాలను మనం శుభ్రం చేసుకుందామని,స్ఫూర్తిదాయకమైన సేవా కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరిస్తున్నారని అన్నారు . టీచర్లు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు కూడా పాల్గొని తమ వంతు బాధ్యతను నెరవేరుస్తున్నారని అన్నారు . ఏ స్కూల్ ను ఎవరెవరు శుభ్రం చేయాలనే విషయంపై నిన్ననే "టిఫిన్ బైఠక్" నిర్వహించామని,అందులో భాగంగా ఈరోజు పాఠశాలలను శుభ్రం చేస్తున్నామని అన్నారు . ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరుతూ ఎల్లుండి గ్రామాలు, మండలాల వారీగా ర్యాలీలు కూడా నిర్వహించబోతున్నామని అన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలన్నది నా సంకల్పమని, అందులో భాగంగానే ప్రభుత్వ స్కూళ్లలో టెన్త్ చదివే విద్యార్థులందరికీ ఈసారి కూడా సైకిళ్లు అందించబోతున్నామని అన్నారు . టెన్త్ విద్యార్థులందరికీ నా వేతనం నుండి పరీక్ష ఫీజు చెల్లిస్తామని, పాఠశాల అభ్యున్నతి కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతమని, పాఠశాలలో నెలకొన్న సమస్యలపైనా త్వరలోనే సమీక్ష చేస్తా. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు.ఇక్కడ బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి,సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# చిక్కాల అశ్విన్ రావు చిత్రపటానికి కేటీఆర్ నివాళి..

**బాధిత కుటుంబానికి పరామర్శ**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా సెస్ చైర్మన్ చిక్కాల రామారావు కుమారుడు కీర్తిశేషులు చిక్కాల అశ్విన్ రావు ఇటీవల అకాల మరణం చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈరోజు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల శాసనసభ్యులు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) సిరిసిల్లలోని చిక్కాల రామారావు నివాసానికి వెళ్లి అశ్విన్ రావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

అశ్విన్ రావు అకాల మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పి కేటీఆర్ ఓదార్చారు. ఈ దుఃఖ సమయంలో భగవంతుడు కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. అశ్విన్ రావు సేవలను, సౌమ్య స్వభావాన్ని స్మరించుకుంటూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కేటీఆర్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రకృతి వైపరీత్య బాధితులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం..

**-కేకే మహేందర్ రెడ్డి**

**బలగం టీవీ, గంభీరావుపేట :**

గంభీరావుపేట మండలంలోని లింగన్నపేట మరియు లింగన్నపేట తండాలో అకాల గాలివానల కారణంగా ఇళ్లు కూలిపోయి, తీవ్రంగా నష్టపోయిన కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి శనివారం పరామర్శించారు. పార్టీ శ్రేణులు మరియు అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించిన ఆయన, దెబ్బతిన్న నివాసాలను, రేకులు లేచిపోయిన ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులకు ధైర్యం చెబుతూ, కాంగ్రెస్ పార్టీ మరియు ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని, అధైర్యపడాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు.

బాధితుల కష్టాల్లో తాము తోడుగా ఉంటామని, జరిగిన నష్టాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తగిన సహాయక చర్యలు అందేలా వ్యక్తిగతంగా కృషి చేస్తానని మహేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. గుడిసెలు లేని తెలంగాణ రాష్ట్రాన్ని నిర్మించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని, అందులో భాగంగానే ప్రకృతి వైపరీత్యాల వల్ల ఇళ్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వ సాయంతో పాటు 'ఇందిరమ్మ ఇళ్ల' పథకం కింద కొత్తగా ఇళ్లను మంజూరు చేస్తామని అన్నారు . కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ దళిత, బడుగు, బలహీన వర్గాల పక్షాన ఉంటుందని అన్నారు .

గత పాలకులు ప్రకృతి వైపరీత్యాల సమయంలో జరిగిన పంట, ఆస్తి నష్టాన్ని ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. తాము బాధితులకు బాసటగా ఉంటూ, ప్రభుత్వ పరంగా అందాల్సిన ప్రతి సహాయాన్ని కచ్చితంగా అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పర్ష హన్మాండ్లు, మండల శాఖ అధ్యక్షుడు హమీద్, యూత్ మండల అధ్యక్షుడు గంగి స్వామి, స్థానిక సర్పంచులు, ఉప సర్పంచులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

